

# పుస్తక పరిచయం




**Published by:**
Emesco Books
1-2-7, Banoo Colony
Gagan Mahal Road, Domalguda
HYDERABAD – 500 029

**డా.కె.వివేకానందమూర్తిగారు** తెలుగు సాహితీ లోకానికి సుపరిచితులే. ముఖ్యంగా కౌముది పాఠకులకు వివేకంగారిని ప్రత్యేకంగా పరిచయం చేయల్సిన అవసరం లేదనుకుంటాము. గత మూడేళ్ళుగా తన సినీ బేతాళ కథలతో నెలనెలా నవ్వుల పువ్వుల్ని పూయిస్తున్నారు. ఇప్పుడు అవే కథలు పుస్తకరూపంలో వచ్చాయి. ఇంతకాలం అంతర్జాతీయంగా తెలుగుపాఠకులను అలరించిన హాస్యకథా కదంబం ఇప్పుడు తెలుగు రాష్ట్రాలలోని పుస్తకప్రియులకూ చేరువైంది. డా.వివేకానందమూర్తిగారు 45 సంవత్సరాలక్రిందట తెలుగు సినిమారంగంలో ఉన్నారనీ, కొన్ని సినిమాల్లో నటించారనీ చాలామందికి తెలియకపోవచ్చు. అంతే కాదు ఆయన కొన్నాళ్ళ ఒక సినీపత్రికకు సంపాదకులుగా కూడా పనిచేశారు. ఇంతేకాక ఆయన చక్కటి మిమిక్రీ కళాకారులు, ఇంకా చక్కటి కథారచయితకూడా. ఇన్ని రంగాల్లో ప్రవేశం, ప్రావీణ్యత ఉన్న డాక్టర్‌గారు గతనాలుగు దశాబ్దాలుగా ఇంగ్లాండులో వైద్యుడుగా స్థిరపడ్డారు. తమ సినీలోక పరిచయంతో ధారావాహికంగా కథలు వ్రాయమని అడగ్గానే కౌముది అభ్యర్థనను మన్నించి గత మూడు సంవత్సరాలు పైగా ఈ శీర్షికను కొనసాగిస్తున్నారు. అదే పేరుతో అచ్చులో వచ్చిన ఈ పుస్తకం చక్కటి, అర్థవంతమైన ముఖచిత్రంతో రూపుదిద్దుకుంది. ఎమెస్కో ప్రచురణ సంస్థవారు దీన్ని క్రిందటి నెలలోనే ప్రచురించారు. ఈ పుస్తకానికి, మిత్రులు గొల్లపూడి మారుతిరావుగారు సమగ్రమైన ముందుమాట వ్రాశారు. నాలుగు దశాబ్దాలు సినీరంగానికి దూరంగా ఉన్నా, సినీరంగలో ఉన్నవారు కూడా చూడలేని కోణాలని అత్యంత హాస్యస్ఫోరకంగా ఈ కథల్లో చిత్రించారు రచయిత. సంభాషణా హాస్యం, సన్నివేశ హాస్యం సమపాళ్ళలో కలగలసిన కథలు ఇవన్నీ. చాలా క్లుప్తంగా ఉంటాయి, ఐనా కడుపుబ్బా నవ్విస్తాయి. తొలివాక్యం నుంచే పాఠకుడిని నవ్వులనదిలో మునకలు వేయడానికి సిద్ధంచేస్తాయి. సరిగ్గా వాడుకోగలిగితే ఈ కథల్లోని సన్నివేశాలన్నీ నిజంగా సినిమాల్లో హాస్యగల్పికలుగా ఉపయోగించుకోవచ్చు. ఆరోగ్యకరమైన హాస్యానికి మచ్చుతునకలు, మెచ్చుతునకలు, ఆధునిక తెలుగు సినీరంగానికి నిలువుటద్దాలు.. ఈ సినీ బేతాళ కథలు!! ★★★




**మెదక్ జిల్లాలోని** రామునిపట్ల గ్రామంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న భైతి దుర్గయ్యగారు మూడేళ్ళ క్రిందట ప్రచురించిన స్వీయకవితా సంపుటి 'అక్షర సేద్యం'ని క్రిందటి సంచికలో పరిచయం చేశాము. అదే రచయిత ప్రచురించిన తాజా కవితా సంపుటి ఈ అలుకు మొలకలు. మొదటి సంపుటిలానే ఇందులోని కవితలన్నీ సమాజంలోని సంఘటనలకు స్పందించి వ్రాసినవే. అభూతకల్పనలు, భావుకతా కవిత్వం చాలా తక్కువగా కనిపిస్తాయి ఈ సంపుటిలో. ఇందులోని 41 కవితలూ కవి స్పందించి, ఆలోచించి, పదిమందినీ ఆలోచింపచేసేలా వ్రాసినవే. ముందుమాట వ్రాసిన డా.ఏనుగు నరసింహారెడ్డిగారు రచయిత గురించి, ఇందులోని కవితల గురించి సమగ్రమైన విశ్లేషణ చేశారు. రచయిత భైతి దుర్గయ్యగారు ప్రతికూల పరిస్థితుల్లో పాఠశాల విద్యపూర్తిచేసి, మద్రాసులో ఫిలిం ఇన్స్టిట్యూట్ నుంచి సినీదర్శకత్వ విభాగంలో శిక్షణ పొందారు. సినీరంగంలో ముందుకు వెళ్ళే అవకాశాలు లేక ఉపాధ్యాయుడిగా స్థిరపడి, కవిగా సమాజానికి తనవంతు సేవని అందిస్తున్నారు. డా.ఏనుగు నరసింహారెడ్డిగారి మాటల్లోనే చెప్పాలంటే "ఒక హన్మంతు, దాశరథి, కాళోజి, గోరేటి వెంకన్న లాగానే దుర్గయ్య కూడా ఇక్కడి చరిత్ర కుదిపిన కుదుపులను ఆకళింపు చేసుకొని ప్రజలపక్షం వహించిన వాడు. మలిదశ ఉద్యమంలో సకలజనులతో నడిచినవాడు. అందుకే ఇక్కడి యువతకు విద్యాబుద్ధులతో పాటు పోరాటపు దారులు చూపిస్తున్న వాడు". దుర్గయ్యగారి జీవనపోరాటం ఈ కవితల్లో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ పుస్తకంలోని కవితల్లో అధికభాగం తెలుగు వెలుగు, బతుకమ్మ, నేటినిజం, నమస్తే తెలంగాణా, ఆంధ్రభూమి, సూర్య, ధర్మశాస్త్రం, తెలుగువేదిక, ఆమని, మధురిమ లాంటి పత్రికలలో ప్రచురించబడినవే. ఇందులోని కవితల్లోంచి కొన్ని భావాలు, వాక్యాలు - పాత్రికేయుడి గురించి వ్రాస్తూ కడలి తరంగం అనే కవితలో "నవనాగరిక సమాజంలో / పేరుకుపోయిన చెత్తకుప్పలను కాల్చి బూడిద చేయడానికి / కంకణ బద్ధుడైన / నిప్పురవ్వ అతడు " అంటారు. భావకాలుష్యం గురించి ఆవేదన చెందుతూ " తనువంతా కుటిల రసాయనాలతో / కంపుకొడుతూ బుసలుకొట్టె / భావ కాలుష్య బారి నుండి / భావి తరానికి విమోచనెప్పుడు?" అని ప్రశ్నిస్తారు. మన బతుకమ్మలో " తెలంగాణా సాంస్కృతిక వైభవం / ఆడపడుచుల స్వాభిమాన కిరీటం / పువ్వులనే దైవంగా కొలిచే / పునీత సంస్కృతుల వేదిక" అంటారు. దుర్గయ్యగారి ఆలోచనలకు, ఆవేశపూరితమైన భావాలకు దర్పణాలు ఈ కవితలు.

★★★

*భైతి దుర్గయ్య, టీచర్*
*గ్రా. రామునిపట్ల*
*మం. చిన్నకోడూర్*
*సిద్ధిపేట, మెదక్ జిల్లా - 502267*
*సెల్: 995 900 7914*

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.
**Editor,**
**KOUMUDI(Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**